సైనికుల్లా పని చేయాలి

- ప్రజల పక్షాన నిలిచి ముందుకు సాగాలి
- 24 గంటలూ అందుబాటులో ఉంటా
- అధికారం అనేది రాత్రి పగలు లాంటిది
- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గల అశోక్ గార్డెన్స్‌లో సదాశివనగర్, రామారెడ్డి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు గ్రామాల్లో ప్రజల పక్షాన నిలిచి గెలుపునకు కృషి చేయాలన్నారు. అధికార పార్టీ కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం వీలు కాదని, దానిని ప్రజల దృష్టికి తీసుకెళ్లి ఓట్లు రాబట్టాలన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తదని కలలో కూడా ఊహించలేదన్నారు. అధికారం చేపట్టి నెల రోజులు కూడా గడువకముందే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగమైపోతుండ్రని పేర్కొన్నారు. భారతదేశం గర్వించేలా కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన ప్రగతిభవన్‌కు ప్రజాభవన్ అని పేరు మార్చడం సిగ్గు చేటుగా ఉందన్నారు. కార్యకర్తలు కాలాయాపన చేయకుండా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అసలైన కార్యకర్తలను గుర్తించి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. లోక్ సభ ఎన్నికల్లో దేశం గర్వించే విధంగా విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఎంపీ బీబీ పాటిల్, సదాశివనగర్, రామారెడ్డి మండలాల ఎంపీపీలు గైని అనసూయ, నారెడ్డి దశరథ్ రెడ్డి, జెడ్పీటీసీ నర్సింలు, జిల్లా కో-ఆప్షన్‌మెంబర్ మోహినొద్దిన్, మండల కో-ఆప్షన్ అల్తాఫ్, మండల రైతుబంధు అధ్యక్షుడు భూంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, వైస్ చైర్మన్ రాజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంత గూటికి 23వ వార్డు కౌన్సిలర్


పుష్పగుచ్ఛం అందజేస్తున్న కౌన్సిలర్ మానస

కామారెడ్డి టౌన్: పట్టణంలోని 23వ వార్డు కౌన్సిలర్ తేజావు మానస బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారుడు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో పార్టీలో చేరారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఆమె బీఆర్ఎస్‌లో చేరి మళ్లీ సొంతగూటికి చేరారు. మరో నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఒక్కొక్కరిగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీ వీడుతూ కాంగ్రెస్‌లో చేరుతుండటం, త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస శ్రీనివాసరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంపరి లక్ష్మణ్, కౌన్సిలర్ చింతల రవీందర్ గౌడ్, సుతారి రవి ఉన్నారు.

గురుకుల పాఠశాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎల్‌పీవో సురేశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు)లో కొనసాగుతున్న మైనార్టీ గురుకుల పాఠశాలలో 2024-25 సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రచారం చేస్తూ డీఎల్‌పీవో సురేశ్ కరపత్రాలు ఆవిష్కరించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో 41 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యదర్శులు తమ గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ వెంకట్రాములు మాట్లాడారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఉప తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఎంపీవో ప్రభాకరచారి, ఆర్ఐ బాలయ్య పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి


బాన్సువాడలో అవగాహన కల్పిస్తున్న సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ సాయికిరణ్

బాన్సువాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నమో టీం జిల్లా కన్వీనర్ నాగేళ్ల సాయికిరణ్ అన్నారు. బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బాన్సువాడకు చేరింది. కేంద్రం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్, నాబార్డు అధికారి భార్గవ్, అగ్రికల్చర్ అధికారిణి ప్రియాంక, బీజేపీ నాయకులు హన్మండ్లు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



బాన్సువాడ రూరల్: మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఏఎన్ఎం శోభ సూచించారు. బుధవారం ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మహిళలపై జరిగే దాడులు, గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాప్తి జరుగకుండా ప్రతి ఒక్కరు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి భరత్, డాక్టర్ రాములు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'ముద్ర' ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు


మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్

ఎల్లారెడ్డి: ముద్ర పథకం ద్వారా వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం రుణాలను అందిస్తున్నదని లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్ భార్గవ్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ బీమా, కిసాన్ క్రెడిట్ కార్డులను అందిస్తున్నదన్నారు. వ్యవసాయ రంగంలో ఆర్గానిక్ ఫామింగ్, నానో యూరియా, డ్రోన్ ద్వారా స్ప్రే తదితర వాటిని అందిస్తోందని, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచితంగా రూ.5 లక్షల వరకు దేశంలో ఎక్కడైనా ఉచిత వైద్యం పొందవచ్చని అన్నారు. ఏడీఏ రత్న, వెటర్నరీ వైద్యులు అర్చన, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్లు రమేశ్, పవన్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తదితరులున్నారు.

నర్సరీ మొక్కల ఎదుగుదలపై దృష్టి సారించాలి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నర్సరీలోని మొక్కల ఎదుగుదలపై దృష్టి సారించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. వదల్‌పర్తి నర్సరీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో మొక్కల పెంపకం కోసం ఏర్పాటు చేసిన బ్యాగులను ఆయన పరిశీలించారు. బ్యాగుల్లో నాటిన విత్తనాల గురించి కార్యదర్శి అజీమొద్దీన్‌ను అడిగి ఆయన తెలుసుకున్నారు. దీంతోపాటు ప్రతిరోజు మొక్కలకు నీటిని పట్టించాలని చెప్పారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



బాన్సువాడ రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు కూడా స్వయం ఉపాధిపై దృష్టి సారించి కుటుంబానికి ఆసరాగా నిలవాలని అక్షయ స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ భూపాల్ సూచించారు. బుధవారం ఆయన ఇబ్రహీంపేట్‌లో 30 రోజులు టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ తరఫున శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అలాగే బ్యూటీపార్లర్, అల్లికలు, మగ్గం వర్క్‌లోనూ శిక్షణ ఇవ్వాలని మహిళలు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. శిక్షకులు లక్ష్మి, సమీరా, అమేర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం


లింగంపేట: రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినులను సన్మానిస్తున్న అధికారి వాసంతి


రామారెడ్డి: చిన్నారులతో కలిసి మొక్క నాటుతున్న అంగన్‌వాడి వర్కర్

సాక్షి నెట్‌వర్క్: ప్రతి బాలిక తప్పనిసరిగా చదుకోవాలని, ఉన్నత చదువుల్లో రాణించాలని ప్రభుత్వాధికారులు ఆకాంక్షించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బాలికల రక్షణ, వారి విద్య కోసం కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో - బేటీ పడావో పథకాన్ని అమలు చేస్తోందన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్నదన్నారు. బాలికలు, బాలురతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడాలని స్ఫూర్తి నింపారు. బాలికలు సహనానికి మారుపేరని కొనియాడారు. విద్యను అర్ధాంతరంగా నిలిపివేయకుండా కొనసాగించి తమ లక్ష్యాలను అందుకోవాలన్నారు.


జిల్లా కేంద్రంలో ఆర్కే కళాశాలలో విద్యార్థినులతో ఏబీవీపీ మహిళా నాయకులు


శ్రీరామ్‌నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


ఎల్లారెడ్డిరూరల్: కృష్ణవేణి స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్


దోమకొండలో..ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి

ఎల్లారెడ్డిరూరల్/దోమకొండ/నిజాంసాగర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎల్లారెడ్డి కృష్ణవేణి హైస్కూల్లో ఎస్సై గణేశ్, దోమకొండ మండల కేంద్రంలో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, నిజాంసాగర్, జుక్కల్ మండల కేంద్రాల్లో జుక్కల్ ఎస్సై సత్యనారాయణ, నిజాంసాగర్ పోలీసులు అవగాహన కల్పించారు. ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దని, బ్యాంకు ఖాతా వివరాలు అపరిచితులకు ఇవ్వొద్దని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.


జుక్కల్‌లో.. ఎస్సై సత్యనారాయణ


ఒడ్డేపల్లిలో ..

చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించాలి



భిక్కనూరు: విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ దేమే రాజిరెడ్డి అన్నారు. బుధవారం జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గఫూర్ శిక్షక్ రచించిన దేశభక్తి నినాదాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లకు దేశభక్తి, సంస్కృతి సాంప్రదాయల గురించి చిన్నతనంనుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గఫూర్ శిక్షక్‌ను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

రాజంపేట: ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిమాపక దళం డెమో క్లాసుల నిర్వహణ కార్యక్రమాన్ని చేపట్టారు. కామారెడ్డి ఫైర్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్నిమాపక దళం గురించి ప్రాక్టికల్స్ క్లాసులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ సీఐ దొడ్ల మోహన్ రావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచి ఉన్నత చదువుల కోసం ఆలోచన చేయాలని, ప్రతి ఒక్కరు సేవాదృక్పథంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేసి వాటిని ప్రారంభించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గంగామోహన్, సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ సీఐ దొడ్లే మోహన్ రావ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అంకం శ్యామ్ రావ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారుడికి అభినందనలు



నిజాంసాగర్(జుక్కల్): నేపాల్‌లో జరుగనున్న 7వ బ్లాక్ ఇంటర్నేషనల్ ఖోఖో చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారుడు పవార్ హరీష్‌ను బుధవారం బిచ్కుంద మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే సన్మానించారు. జుక్కల్ మండలం సవర్‌గావ్ సర్పంచ్ పవార్ కిషన్ కుమారుడు హరీష్. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే క్రీడాకారుడిని ఘనంగా సన్మానించారు. సవర్‌గావ్ సర్పంచ్ పవార్ కిషన్, ఉప సర్పంచ్ శంకర్, డోన్‌గావ్ సర్పంచ్ రాజు, బీఆర్ఎస్ నాయకుడు రామ్‌రావ్,వినీత్ తదితరులున్నారు.

సమాచారం..

నేడు సామూహిక నవదుర్గ వ్రతం

కామారెడ్డి అర్బన్: స్థానిక హౌసింగ్ బోర్డులోని శారదా మాత శంకరచార్యుల ఆలయంలో పున్నమి సందర్భంగా గురువారం ఉదయం 11 గంటలకు సామూహిక నవదుర్గ వ్రతం, అన్నదానం నిర్వహించనున్నట్టు, పూజ సామాగ్రి ఆలయ కమిటీ తరపున ఇస్తామని ఆలయ అధ్యక్షుడు కారంగుల మహిపాల్‌రెడ్డి తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మున్నూరుకాపు ప్రతిభ పురస్కారాలు

కామారెడ్డి అర్బన్: మున్నూరుకాపు విద్యార్థుల్లో ప్రతిభావంతులకు ఫిబ్రవరి 11న కామారెడ్డి వైద్యకళాశాల వద్ద గల మున్నూరుకాపు జిల్లా సంఘం వద్ద ప్రతిభా పురస్కార చెక్కులు అందజేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిండ్ల అంజయ, పెట్టుగాడి అంజయ్యలు తెలిపారు. విద్యార్థులకు స్వయంగా ఫోన్‌చేసి సమాచారం అందిస్తామని వారు పేర్కొన్నారు.

రేపు శ్రావణి ఐటీఐలో జాబ్‌మేళా

కామారెడ్డి: జిల్లా కేంద్రంలోని శ్రావణి ఐటీఐ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు మహీంద్రా, ఐటీసీ, ఎంఎస్‌సీ, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఆటోమోటివ్, తోషిబా కంపెనీలలో ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి కల్పన శిక్షణ శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ బి.సీతారాములు హాజరవుతున్నారన్నారు. ఎలక్ట్రిషియన్, మెకానిక్, డీజిల్, సీవింగ్ టెక్నాలజీ విభాగంలో శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దు


ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మాచారెడ్డి: ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని పేర్కొంటూ బుధవారం లక్ష్మీరావులపల్లిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న శీతాకాల శిబిరంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం అధికారి రామకృష్ణారెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి, వలంటీర్లు ఉన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ డ్రైవర్‌కు అవార్డు



పిట్లం(జుక్కల్): బాన్సువాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పిట్లంకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సయ్యద్ యాదుల్లాను డిపో రీజినల్ మేనేజర్ జానీ రెడ్డి అభినందించారు. శాలువాతో సత్కరించి, అవార్డును అందజేశారు. కార్యక్రమంలో డిపో డీఎం సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడలో..



బాన్సువాడ : బాన్సువాడ ఆర్టీసీ డిపోలో బుధవారం ఉత్తమ డ్రైవర్లను ఆర్ఎం జానీరెడ్డి సన్మానించారు. డ్రైవర్ల దినోత్సవం పురస్కరించుకుని డ్రైవర్లకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. ఆర్టీసీలో కీలక బాధ్యతలు నిర్వహించే డ్రైవర్లను సన్మానించడం హర్షణీయమని అన్నారు. ఆర్టీసీ సంస్థ ముందుకెళ్లాలంటే డ్రైవర్లు ముఖ్య భూమిక పోషించాల్సి ఉంటుందని అన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే డాక్టర్ శ్రీప్రియా 8వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. పలువురికి మందులు అందించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తామని డాక్టర్లు తెలిపారు. పాఠశాల ప్రత్యేక అధికారి రాగిణి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో..



రాజంపేట: ఎనీమియా ముక్త్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్తహీనత, ఆహారపు అలవాట్లు, పరిశుభ్రతల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ హరీష్, దివ్యభారతి, ఏఎన్ఎం నీరజ, ఫార్మాసిస్టు స్వప్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి



ఎల్లారెడ్డి: ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ పన్నులు వసూలు చేయించారు. ప్రతి ఒక్కరు వారి ఇంటి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సిబ్బంది ఆంజనేయులు, అజయ్ తదితరులున్నారు.

సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కట్టకిందితండా ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ మాధవి బుధవారం సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహానికి ఎంపీపీ ప్రత్యేకంగా పూజలు చేశారు. ఎంపీవో ప్రకాష్, సర్పంచ్ చాందీబాయి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పుస్తకాల విరాళం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి క్రిష్ణాజీవాడి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గిరిధర్, పుస్తకాలను విరాళంగా బుధవారం అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడే ఐఐటీకి సంబంధించిన రూ.5 వేల విలువ గల పుస్తకాలను గ్రంథపాలకుడికి అందజేశారు. గ్రంథపాలకుడు రాజలింగం, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

వడ్డెరలకు రూ.3 వేల కోట్లు కేటాయించాలి

కామారెడ్డి టౌన్: వడ్డెర వృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లను కేటాయించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అన్ని విధాలా వడ్డెరలను ఆదుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు, నాయకులు సుదర్శన్, నర్సింలున్నారు.

ఆటో యూనియన్ జిల్లా జేఏసీ ఉపాధ్యక్షుడి నియామకం

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా ఆటో యూనియన్ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ బసగల్ల సిద్దరాములును ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిద్దరాములు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం వల్ల ఆటో డ్రైవర్ల జీవన విధానం కుంటుపడిందన్నారు.

'విద్యార్థులకు చతుర్విద ప్రక్రియలు రావాలి'

కామారెడ్డి అర్బన్: విద్యార్థులకు చతుర్విద ప్రక్రియలు రావాలని మండల విద్యాశాఖాధికారి ఎల్లయ్య అన్నారు. కామారెడ్డి మండలం నర్సన్నపల్లి, ఆర్‌బీ గర్ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఆయన తనిఖీలు చేసి విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరీక్షించారు. సీఆర్‌పీ చిరంజీవి, ఉపాధ్యాయులు సాయిరెడ్డి, సునీల్, వసుంధర ఉన్నారు.

వ్యాయామంతోనే సత్ఫలితాలు

పెద్దకొగప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామం చేయించడం వల్ల సత్ఫలితాలు వస్తాయని ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించి, దివ్యాంగ పిల్లలకు వ్యాయమాలు చేయించారు. అనంతరం తల్లిదండ్రులకు సూచనలిచ్చారు.

పాఠశాల తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): రాంపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీపీ గరీబున్నిసాబేగం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయా తరగతుల విద్యార్థులను గణితం, ఇంగ్లీష్, పరిసరాల విజ్ఞానం సబ్జక్టులలో ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు సరైన సమాధానలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందజేయాలని సూచించారు. అలాగే అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శైలజ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై పోరాటం

పిట్లం(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో టీపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై టీపీఎస్ఎఫ్ ఎప్పుడూ పోరాడుతుందన్నారు. అదే విధంగా ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు టీపీఎస్ఎఫ్ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

రాజంపేటలో..టీపీఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు

రాజంపేట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) పిలుపు మేరకు రాజంపేట మండల పంచాయతీ కార్యదర్శుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులు అందరు సభ్యత్వ నమోదు చేసుకున్నారు.